# సాక్షి చిత్తూరు

ఆదివారం । 13 । జూలై । 2025



## క్యాబేజీ అ'ధర'హో

నిన్న, మొన్నటి వరకు టన్ను రూ.వెయ్యి ధర పలికిన క్యాబేజీ నేడు అమాంతం రూ.12 వేలకు చేరింది. - 8లో



## ఫల'రాజసం'

తోతాపురి ధరలకు రెక్కలొచ్చాయి. నిన్నటి వరకు కిలో రూ.2 అమ్మిన మామిడి, ప్రస్తుతం కిలో రూ.7కు చేరింది. - 8లో



## 250 మొబైల్ ఫోన్ల అప్పగింత

పలువురు పోగొట్టుకున్న రూ.50 లక్షల విలువ చేసే 250 మొబైల్ ఫోన్లను పోలీసులు బాధితులకు అప్పగించారు. - 8లో

## న్యూస్‌రీల్

### పేరు తొలగింపునకు అవకాశం

చిత్తూరు రూరల్ (కాణిపాకం): రేషన్‌కార్డులో పేరు తొలగింపునకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు డీఎస్‌ఓ శంకరన్ తెలిపారు. ఇందుకు సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తు ఫారానికి రేషన్‌కార్డు, ఆధార్ జిరాక్స్ కాపీలు జత చేయాలన్నారు. వివాహమై, కుటుంబ నుంచి వేరు పడాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

### ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు అనుమతి

కుప్పం: ద్రవిడ వర్సిటీలో ఇంజినీరింగ్ కోర్సులకు అడ్మిషన్లకు అనుమతులు ఇస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. 2025–26 విద్యా సంవత్సరానికి ద్రవిడ వర్సిటీకి ప్రతి కోర్సుకు 60 సీట్లు మంజూరు చేస్తున్నట్టు ఉన్నత విద్యాశాఖ ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ ఏడాది నుంచి ఇంజిరింగ్ కోర్సులు ప్రారంభించాలని ప్రభుత్వం వర్సిటీ ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి మిగిలిన వివరాలు వర్సిటీ అధికారులను సంప్రదించాల్సి ఉందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది.

### గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచెర్ల మహాత్మా జ్యోతి బాపూలే గురుకుల పాఠశాల(ఇంగ్లిష్ మీడియం)లో 2025–26 సంవత్సరానికి గాను 5, 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి.సునీత తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 10.50 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. పరీక్షలకు వచ్చేవారు పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆధార్ జిరాక్స్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుంచి స్టడీ సర్టిఫికెట్ తీసుకుని ఈ నెల 12 నుంచి 18వ తేదీ లోపు పాఠశాలలో దరఖాస్తు ఫారం పొందవచ్చని, పూర్తి చేసిన దరఖాస్తులను 18వ తేదీ సాయంత్రం లోపు అందజేసి హాల్ టికెట్ పొందవచ్చని తెలిపారు. వివరాలు 7842790588 నంబరులో సంప్రదించాలని సూచించారు.

### ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులు

సదుం: మండలంలోని మహాత్మా జ్యోతిబాపూలే బీసీ బాలుర గురుకుల పాఠశాలలో 5, 7, 8, 9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీనివాసులు తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ లోపు అందజేయాలని తెలిపారు. ఈ నెల 20న పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని వెల్లడించారు. వివరాలకు పాఠశాలలో సంప్రదించాలన్నారు. పాఠశాలకు వచ్చే విద్యార్థులు రెండు ఫొటోలు, ఆధార్ కార్డును తీసుకురావాలన్నారు.

### సర్వదర్శనానికి 24 గంటలు

తిరుమల: తిరుమల శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటల సమయం పడుతోంది. వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండాయి. క్యూలు శిలాతోరణం వద్దకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి వరకు 70,217 మంది స్వామిని దర్శించుకున్నారు. 31,155 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.84 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. దర్శన టికెట్లు లేని వారికి 24 గంటలు పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు కలిగిన భక్తులకు 3 గంటల్లో దర్శనం లభిస్తోంది.






జనసేన నాయకురాలు వినుత, ఆమె భర్త చంద్రశేఖర్ నాయుడుతో ఆమె డ్రైవర్ శ్రీనివాసులు అలియాస్ రాయుడు(ఫైల్)

# వినుత పన్నాగం!

## శ్రీకాళహస్తి జనసేన ఇన్‌చార్జ్ డ్రైవర్ దారుణ హత్య

- రాజకీయ వ్యూహాలు చేరవేస్తున్నాడని గత నెలలో డ్రైవర్‌గా తొలగింపు
- వ్యక్తిగత రహస్యాలు బట్టబయలవుతాయని కడతేర్చిన వైనం
- జనసేన నుంచి వినుతను తప్పిస్తూ పార్టీ అధిష్టానం ఆదేశాలు

ఏర్పేడు : చిన్న వయస్సులోనే పెద్ద పదవి వరించింది.. జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు తీసుకుని ప్రతి అంశాన్నీ వివాదాస్పదం చేస్తూ.. పబ్లిసిటీ స్టంట్‌తో నెట్టుకొచ్చిన కోట వినుత అసలు బండారం బట్టబయలైంది. అంతర్గత వ్యవహారాల సమాచారాన్ని శ్రీకాళహస్తిలోని ఓ కీలక నాయకుడికి చేరవేస్తున్నాడని భావించింది. తన వద్ద డ్రైవర్‌గా పనిచేసే శ్రీనివాసులు అలియాస్ రాయుడు(22)ను కిరాతకంగా చంపించి చెన్నైలోని ఓ నదిలో పడవేసినట్టు చెన్నై పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు రావడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనలో కోట వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు, మరో ముగ్గురు పార్టీ కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకుని తీవ్ర స్థాయిలో విచారిస్తుండడం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమైంది.

**సాధారణ యువతి నుంచి..**

రేణిగుంటకు చెందిన నగరం వినుత తండ్రి నగరం భాస్కర్ స్థానికంగా మెడికల్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నాడు. నగరం వినుత తండ్రికి సహాయపడుతూ ఉండేది. ఈ క్రమంలోనే తన కళాశాలలో పరిచయమైన చిత్తూరు జిల్లా, బంగారుపాళెంకు చెందిన కోట చంద్రశేఖర్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. అయితే పవన్ కల్యాణ్ జనసేన పార్టీలో చేరడం, ఆమెకు శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా పదవి దక్కడం.. 2019 ఎన్నికల్లో జనసేన పార్టీ తరఫున ఎమ్మెల్యేగా పోటీ చేసి కేవలం 5 వేల ఓట్లు పడడంతో డిపాజిట్ కోల్పోయింది. ఎలాగైన వార్తల్లో ఉండాలని నిత్యం అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిపై విమర్శలు చేస్తూ వచ్చేది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినా, ఆమెపై పార్టీలోని ఓ వర్గం వ్యతిరేకంగా ఉండడం, ఆశించిన ఆదరణ లేకపోవడంతో టీడీపీ ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వినుతను పట్టించుకోవడం మానేశారు.

### ఎవరీ శ్రీనివాసులు ?

శ్రీకాళహస్తి మండలం, బొక్కసంపాళెం గ్రామానికి చెందిన శ్రీనివాసులు అలియాస్ రాయుడుకు ఏడేళ్ల వయస్సులోనే అతడి తల్లిదండ్రులు వెంకటరాయుడు, గీత చనిపోయారు. వీరి స్వగ్రామం వెంకటగిరి సమీపంలోని తోలుమిట్ట. అయితే శ్రీనివాసులు, అతడి సోదరిని అమ్మమ్మ రాజేశ్వరి శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెంకు తీసుకొచ్చి పెంచి పోషించింది. శ్రీనివాసులుకు పవన్‌కల్యాణ్‌పై ఉన్న అభిమానంతో జనసేన పార్టీలో కార్యకర్తగా చురుగ్గా పాల్గొనేవాడు. ఈ క్రమంలోనే శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమితులైన కోట వినుతకు దగ్గరయ్యాడు. 15 ఏళ్లుగా వారికి నమ్మిన బంటుగా ఉండడంతో ఆమెకు వ్యక్తిగత సహాయకుడిగా, కారు డ్రైవర్‌గా చేరాడు. ప్రతి కార్యక్రమంలోనూ వారిని వెంటబెట్టుకుని ఉంటూ ఇంట్లో కుటుంబ సభ్యుడిగా మారిపోయాడు.

చిన్నప్పుడే తల్లిదండ్రులు కోల్పోయాడు. ఎవరూ లేని అనాథగా మిగిలాడు. తన అమ్మమ్మ వద్ద పెరిగి పెద్దవాడయ్యాడు. కొన్నేళ్ల తర్వాత తన అభిమాన హీరో పవన్ కళ్యాణ్ పెట్టిన జనసేన పార్టీలో చేరాడు. ఆపై పార్టీ శ్రీకాళహస్తి ఇన్‌చార్జ్ వినుత వద్ద వ్యక్తిగత కార్యదర్శిగా.. డ్రైవర్‌గా విధుల్లో చేరాడు. చిన్నప్పటి నుంచి నమ్మినబంటుగా మెలిగాడు. ఏమైందో ఏమోగానీ ఇటీవల అతనిపై అనుమానం పెంచుకున్నారు. విధుల నుంచి సైతం తొలగించేశారు. వ్యక్తిగత రహస్యాలు, పార్టీ కార్యకలాపాలు బయటపెడుతున్నాడన్న కక్షతో అతికిరాతకంగా చంపేశారు. మృతదేహాన్ని చెన్నైకి తీసుకెళ్లి ఓ నదిలో పడేసి చేతులు దులుపుకోవాలని చూశారు. అయితే అక్కడి పోలీసులు చాకచక్యంగా ఛేదించి నిందితులను అదుపులోకి తీసుకోవడం ఇప్పుడు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో ఇది హాట్‌టాపిక్‌గా మారింది.

### నిందితులను పట్టించిన పచ్చబొట్టు

చెన్నై నగరం, నార్త్ జోన్ సెవన్ వెల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రైనేజీ కాల్వలో యువకుడి మృతదేహాన్ని ఈనెల 8వ తేదీన గుర్తించిన పోలీసులు పోస్టుమార్టంలో హత్య జరిగినట్లు నిర్ధారణకు వచ్చారు. అయితే మృతుడి చేతి మీద జనసేన పార్టీ గుర్తు, వినుత పేరు పచ్చబొట్టు ఉండడంతో ఆ దిశగా దర్యాప్తు కొనసాగించారు. సీసీ ఫుటేజ్ లభించడంతో శనివారం తెల్లవారుజామున శ్రీకాళహస్తికి చేరుకున్న చెన్నై పోలీసులు జనసేన ఇన్‌చార్జి కోట వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు, హత్యకు సహకరించిన రేణిగుంటకు చెందిన దస్తా సాహెబ్, శ్రీకాళహస్తికి చెందిన కె.శివకుమార్, తొట్టంబేడు మండలానికి చెందిన ఎస్.గోపిని తమిళనాడు పోలీసులు అరెస్ట్ చేసి చెన్నైకి తీసుకెళ్లారు.

### హత్య ఎందుకు జరిగింది..ఎలా చేశారంటే?

జనసేన నేత వినుత వద్ద ఉన్న శ్రీనివాసులుపై నిఘా పెట్టిన శ్రీకాళహస్తి నియోజకవర్గ ముఖ్య నేత అతడికి డబ్బులు ఎర చూపి, వారి రాజకీయ వ్యూహాలు, ఇతర వ్యక్తిగత విషయాలకు సంబంధించి కీలక సమాచారాన్ని తెలుసుకున్నట్లు సమాచారం. దీన్ని కోట వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు గుర్తించినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే గత నెల 21న శ్రీనివాసులును విధుల నుంచి తొలగించారు. అయితే కోట వినుతతో ఉన్న కొన్ని వీడియోలు బయట పడడంతో అతడిని మట్టుబెట్టాలని గత నెలలోనే పక్కా ప్లాన్ వేసినట్లు చెన్నై పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం. అయితే అందులోని కొన్ని వీడియోలు బహిర్గతం కావడంతో జీర్ణించుకోలేని కోట చంద్రశేఖర్‌నాయుడు అతడిని ఎలాగైనా అంతమొందించాలని భావించినట్టు తెలిసింది. తలచిందే తడువుగా పక్కా ప్లాన్ ప్రకారం పార్టీలోని మరో నలుగురు వ్యక్తుల సహాయంతో శ్రీనివాసులును శ్రీకాళహస్తిలోని ఓ గోడౌన్‌కు తీసుకెళ్లి అక్కడ విచక్షణా రహితంగా కొట్టి చంపినట్టు చెన్నై పోలీసులు భావిస్తున్నారు. అక్కడి నుంచి కారులో చెన్నైకి తీసుకెళ్లి మింట్ ఏరియా కూవం నదిలో పడేసి ఆంధ్రాకు తిరిగి వచ్చేశారని చెన్నై పోలీసులు వెల్లడించారు.

### జనసేన నుంచి కోట వినుత బహిష్కరణ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి వినుతను జనసేన పార్టీ నుంచి బహిష్కరించినట్లు ఆ పార్టీ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ తెలిపారు. కొంతకాలంగా పార్టీ కార్యకలాపాలకు వినుత దూరంగా ఉన్నట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం ఎమ్మెల్యే నివాసంలో జరిగిన మీడియా సమావేశంలో వారు ఆ వివరాలు వెల్లడించారు. చెన్నైలో వినుతపై హత్యా నేర అభియోగం నమోదు కావడంతో ఆమెను పార్టీ నుంచి బహిష్కరించినట్లు వారు చెప్పారు.

# ఔను.. వాళ్లు ఒక్కటవుతున్నారు

భార్యాభర్తల మధ్య అంతరాలు.. చిన్న చిన్న తగవులు.. ఇంకొద్దిగా మనస్పర్థలు.. మనస్సు తట్టి హృదయాంతరాల్లోకి చూస్తే తమను తక్కువ చేశారనే భావన.. ముఖ్యంగా కుటుంబ పరిస్థితులపై అవగాహన లేమి.. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దెబ్బతినడం.. సమస్యలు విని సర్దుబాటు చేసే వారు లేకపోవడంతో పలు జంటలు పోలీస్ స్టేషన్ మెట్లెక్కుతున్నాయి. అలాంటి జంటల సమస్యలను పరిష్కరించి, మళ్లీ వారి కాపురాలను చక్కదిద్దుతోంది ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం. నాటి వైఎస్సార్ సీపీ పాలనలో వేసిన ఈ బీజం నేడు సత్ఫలితాలను ఇస్తోంది.

- సత్ఫలితాలిస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం
- వైవాహిక బంధంలో సమస్యలు తీరుస్తున్న ఖాకీలు
- నాటి ప్రభుత్వంలో దిశ.. కూటమిలో మహిళాస్టేషన్
- పేరు మారినా.. ప్రజలకు ఉపయోగపడుతున్న సెంటర్



చిత్తూరు మహిళా స్టేషన్‌లో కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న పోలీసులు



మహిళా స్టేషన్ సిబ్బందితో కలిసి వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు అర్బన్: మహిళల హక్కులు, దాంపత్య జీవితంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించడానికి గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం నాటిన బీజం.. ఇపుడు వృక్షంగా ఎదిగింది. అదే ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం. నాడు దిశ స్టేషన్‌గా నామకరణం చేసి మహిళలకు అండగా నిలిచిన స్టేషన్‌ను.. కూటమి ప్రభుత్వం వచ్చాక మహిళా స్టేషన్‌గా పేరు మార్చి సేవలు అందిస్తోంది. నాటి ప్రభుత్వంలో ఉన్న దిశ ఇపుడు పేరు మార్చినా.. అంతిమంగా ప్రజలకు మేలు జరుగుతోంది. చిత్తూరు నగరంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం ఏర్పాటు చేసి ఏడాది పూర్తయిన నేపథ్యంలో శనివారం ఎస్పీ మణికంఠ చందోలు ఈ కేంద్రం పనితీరును మీడియాకు వివరించారు.

**విభేదాలు పరిష్కరించి..**

చిత్తూరు నగరంలోని దర్గా కూడలిలో ఉన్న ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రం మహిళా పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో పనిచేస్తుంది. మహిళలు, దంపతుల సమస్యలను పరిష్కరించడమే ఈ కేంద్రం లక్ష్యం. పోలీసులతో పాటు రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులు, మానసిక నిపుణులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, మహిళా శిశు సంరక్షణ విభాగం ఉద్యోగులు ఓ కమిటీగా ఉంటారు. ఇంట్లో భర్తతో గొడవలు, అత్త–మామ, వదిన–తోడికోడళ్లు.. చాలా వరకు కేసుల్లో భర్త చెబితే నేను ఎందుకు వినాలి అని భార్య.. భార్యకు గౌరవం ఇవ్వడం ఏమిటని భర్త, అత్తా–మామల చాదస్తం పడలేకపోతున్నామని కొందరు, కోడలు సరిగా చూసుకోవడం లేదని మరికొందరు స్టేషన్ మెట్లు ఎక్కుతుంటారు. ఇలా ఎవరి నుంచైనా సమస్య లు వస్తే నేరుగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లడం, ఫిర్యాదు ఇచ్చి కేసు నమోదు చేయడం చేసేవాళ్లు. కానీ ఈ కేంద్రంలో తొలుత వచ్చి ఫిర్యాదు ఇచ్చినా.. ఎదుటి వ్యక్తులను స్టేషన్‌కు పిలిపిస్తారు. ఇరుపక్షాల సమస్యలు విన్న తరువాత సమస్యకు పరిష్కారం చూపించడంతోపాటు కొద్ది సమయం కూడా ఇస్తారు. సమస్య సమసిపోతే ఎవరికీ ఎలాంటి ఇబ్బంది ఉండదు.. అలా వీలుకాని పక్షంలో చట్టపరంగా ముందుకు వెళతారు.

**482 కేసుల పరిష్కారం..**

ఏడాది కాలంలో ఈ కేంద్రంలో 482 ఘటనల్లో ఎఫ్ఐఆర్‌లు కట్టకుండా సామరస్యంగా పరిష్కరించుకున్నారు. ఆవేశంలో తలెత్తిన విభేదాలకు కొద్దిగా సమయమిచ్చి పరిష్కార మార్గాలు సూచిస్తున్నారు. చిన్నపాటి అభిప్రాయ భేదాలకు దారులు చూపిస్తున్నారు. ఈ కేంద్రంలో జిల్లాకు చెందిన కేసులే కాకుండా.. పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక ఇతర రాష్ట్రాలకు చెందిన 52, విదేశాల నుంచి వచ్చిన మూడు కుటుంబాల్లోని విభేదాలను సైతం పరిష్కరించారు. ఇక జిల్లా వ్యాప్తంగా 748 కుటుంబ సదస్సులు నిర్వహించి, కుటుంబంలో తలెత్తే సమస్యలు ఎలా అధిగమించాలో పాఠశాలల్లోనే పిల్లలకు శిక్షణ ఇస్తున్నారు.

**శృతి మించితే..**

ఫ్యామిలీ కౌన్సెలింగ్ కేంద్రంలో వీలైనంత వరకు ఓ కుటుంబాన్ని నిలబెట్టే ప్రయత్నమే చేస్తారు. కానీ కొన్ని కేసుల్లో భార్యను శారీరకంగా హింసించడం, కట్నం కోసం వేధించడం లాంటివి కూడా వస్తుంటాయి. వీటిపై ఏమాత్రం నిర్లక్ష్యం చేయకుండా కేసులు నమోదు చేస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇలా 181 మందిపై గృహహింస కేసు నమోదుకు సూచించామని, 58 మందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఎస్పీ పేర్కొన్నారు. మహిళలకు ఎలాంటి సమస్య వచ్చినా ఈ స్టేషన్‌కు వెళితే తప్పకుండా న్యాయం జరుగుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ప్రతి శనివారం స్టేషన్‌లో సమస్యలకు కౌన్సెలింగ్ ఇస్తామన్నారు.

## వర్క్‌ఆర్డర్లను పదిరోజుల్లో పూర్తి చేయాలి

చిత్తూరు కార్పొరేషన్: పెండింగ్‌లో ఉన్న వర్క్ ఆర్డర్లను పదిరోజుల్లో పూర్తి చేయాలని ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య ఆదేశించారు. శనివారం ఎస్ఈ కార్యాలయంలో చిత్తూరు అర్బన్ డివిజన్ అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పూతలపట్టు, యాదమరి, ఐరాల రూరల్స్ ఏఈలు నిర్దేశించిన సమయంలో పనులు పూర్తి చేయకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు డబ్బులు చెల్లించి ట్రాన్స్‌ఫార్మర్లు కోసం వేచి చూస్తున్నారన్నారు. వారికి సకాలంలో వ్యవసాయ సర్వీసులను విడుదల చేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల కోసం రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవద్దని చెప్పారు. వేగంగా మరమ్మతులు చేయడానికి చిత్తూరులో అందులోబాటులో ఉన్న నూతన ఓఆర్‌ఎంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సబ్‌డివిజన్ పరంగా పరిశీలన పనులు డీఈలు ఇంటర్ చేంజ్ చేసుకోవాలన్నారు. సంబంధిత ప్రాంతాల్లో పర్యటించి లైన్ సమస్యలను పరిష్కారించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాలకు వరమైన ఆర్‌డీఎస్ఎస్ పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రతి సారీ సాకులు చెబుతూ పనులను ఆలస్యం చేయవద్దన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ ఇస్మాయిల్‌అహ్మద్, ఈఈలు మునిచంద్ర, జగదీష్, అమర్‌బాబు, ఏఓ ప్రసన్న ఆంజనేయులు, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ట్రాన్స్‌కో డైరెక్టర్ గురవయ్య




## కాణిపాకంలో భక్తుల రద్దీ



క్యూలో వేచి ఉన్న భక్తులు

కాణిపాకం: వరసిద్ధి వినాయకస్వామి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో రాష్ట్రంలోని పలు జిల్లాలతోపాటు కర్ణాటక, తమిళనాడు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో వేకువజామున నుంచి రాత్రి వరకు ఆలయంలో రద్దీ నెలకొంది. ఆలయ ఆవరణమంతా భక్త జన సందడి కనిపించింది. భక్తులు స్వామివారిని దర్శించుకున్న అనంతరం ప్రసాదం కోసం క్యూకట్టారు. అలాగే ఆలయ కోనేరు ఎదుట ఫొటోలు దిగారు. భక్తులకు సౌకర్యాల కల్పన ఏర్పాట్లను అధికారులు పర్యవేక్షించారు.



## క్లుప్తంగా

### సన్నిధి వినాయకస్వామి ఆలయంలో చోరీ


తాళాలు పగులగొట్టిన హుండీ

నగరి : పట్టణంలోని బేరివీధిలో ఉన్న సన్నిధి వినాయకస్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. హుండీ తాళాలు పగులగొట్టి చోరీ చేయడంతోపాటు సీసీ కెమెరాలను ధ్వంసం చేశారు. శనివారం ఉదయం యథావిధిగా పూజలు చేయడానికి అర్చకుడు ఆలయానికి వచ్చాడు. అక్కడ హుండీ, సీసీ కెమెరాలు పగులగొట్టి ఉండడం చూసి, ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ విక్రమ్ ఆదేశాల మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆధారాలు సేకరించారు. ఆలయానికి సమీపంగా ఉన్న నివాసాల ముందు అమర్చిన సీసీ కెమెరాలను పరిశీలించి, నిందితుల ఆచూకీ ఆరా తీస్తామని సీఐ తెలిపారు.

### మహిళ అదృశ్యం


మునిరత్నమ్మ(ఫైల్)

గంగవరం: మండలంలోని కొత్తపల్లికి చెందిన సుబ్రమణ్యం రెడ్డి భార్య మునిరత్నమ్మ(61) నాలుగు రోజులుగా కనిపించకుండా పోయిందని ఆమె బంధువులు శనివారం స్థానిక పోలీసులను ఆశ్రయించారు. నాలుగు రోజుల క్రితం ఇంట్లో గొడవపడి వెళ్లిపోయినట్లు కుటుంబసభ్యులు చెబుతున్నారు. ఈ మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి పోలీసులు విచారిస్తున్నారు.

### బస్సును ఢీకొన్న ఐచర్ వాహనం


బస్సును ఢీకొన్న ఐచర్

బంగారుపాళెం : మండలంలోని మహాసముద్రం టోల్‌ప్లాజా వద్ద శనివారం బస్సును ఐచర్ వాహనం ఢీకొన్నట్లు పోలీసులు తెలిపారు. అమరరాజా ఫ్యాక్టరీకి చెందిన బస్సు కార్మికులను తీసుకు వెళ్లేందుకు టోల్‌ప్లాజా వద్ద ఆగింది. అదే సమయంలో పలమనేరు నుంచి చిత్తూరు వెళుతున్న ఐచర్ వాహనం బస్సును వెనుక నుంచి ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ఉన్న వారు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఐచర్ వాహన డ్రైవర్ సలీంకు బలమైన గాయం తగలడంతో హైవే అంబులెన్స్‌లో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### వరకట్నం కేసు నమోదు

పుంగనూరు (చౌడేపల్లె): అధిక కట్నం తేవాలని వివాహితను చిత్రహింసలకు గురి చేసిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ రుక్మిణి నందనాయుడు శనివారం తెలిపారు. ఆయన కథనం మేరకు.. పుంగనూరు మండలంలోని నల్లగుట్లపల్లెకి చెందిన స్వప్నకుమారితో కేవీపల్లె మండలం పెద్దతాండాకు చెందిన గోవింద నాయక్ కుమారుడు బాలాజీనాయక్‌తో గత రెండేళ్ల కిందట పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. కొన్ని రోజులపాటు సజావుగా సాగిన ఈ కుటుంబంలో అధిక కట్నం చిచ్చురేపింది. నిత్యం అధికకట్నం రూ.5 లక్షలు తేవాలని వేధించిన భర్త బాలాజీనాయక్, మామ గోవిందనాయక్, శ్రీదేవి, నూర్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

# క్యాబేజీ అధరహో



పలమనేరు ప్రాంతంలో వ్యాపార పంటల్లో క్యాబేజీ ఒకటి. ఈ పంటకు మొన్నటి వరకు ధర లేక.. అడిగేవారు లేక..పంట పొలాల్లోనే వదిలేశారు. ఈ పంట సాగుపై ఆసక్తి చూపలేదు. టన్ను రూ.వెయ్యి కూడా పలకని క్యాబేజీ నేడు అమాంతం రూ.12 వేలు పలుకుతోంది. దీంతో పుడమిపుత్రుడు పొంగిపోతున్నాడు.

- ప్రస్తుతం టన్ను ధర రూ.12 వేలకు పైగా
- తోటల వద్దే కొంటున్న బయటి రాష్ట్రాల వ్యాపారులు
- నెలకు ముందు టన్ను క్యాబేజీ ధర రూ.వెయ్యి మాత్రమే
- అడిగేవారు లేక తోటల్లోనే పంటను వదిలేసిన రైతులు

పలమనేరు: మొన్నటి దాకా క్యాబేజీని కొనేవారు లేక పంట సాగు చేసిన రైతులు పొలంలోనే పంటను వదిలేశారు. కనీసం టన్ను రూ. వెయ్యికి ఇస్తామన్నా కొనేవారు లేకుండా పోయారు. అలాంటి క్యాబేజీ ధర ఇప్పుడు టన్ను రూ.12 వేలకు పైమాటే. పలు రాష్ట్రాల నుంచి వ్యాపారులు రైతుల తోటల వద్దకొచ్చి పంటను కొని తీసుకెళుతున్నారు. దీంతో ఇప్పుడు క్యాబేజీ సాగు చేసిన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

**పలమనేరు సాగుకు అనుకూలం**

పలమనేరు ప్రాంతం శీతల వాతారణాన్ని కలిగి ఉంటుంది. ఇదే వాతారణం పొరుగునే ఉన్న కర్ణాటక రాష్ట్రం కోలారు జిల్లాలోనూ ఉంది. దీంతో అక్కడి రైతులు పండించే పలు కూరగాయల పంటలను ఇక్కడి రైతులు కొన్నేళ్లుగా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పలమనేరు ఉద్యానశాఖ డివిజన్ పరిధిలో 600 హెక్టార్లలో క్యాబేజీని సాగు చేశారు.

**మొన్నటి దాకా అడిగే దిక్కేలేదు**

గత కొన్ని నెలలుగా క్యాబేజీ ధరలు అమాంతం తగ్గాయి. గత నెలలో టన్ను కేవలం రూ.వెయ్యికి చేరింది. పంటను కొనేవారు లేక రైతులు పంటను కోయకుండా చేలల్లోనే వదిలిపెట్టేశారు. దీంతో రైతులకు పంట పెట్టుబడి సైతం దక్కక నష్టపోవాల్సి వచ్చింది. ధరలు పడిపోవడంతో చాలామంది రైతులు క్యాబేజీ నాటడానికి భయపడ్డారు. ధైర్యం చేసి పంట సాగు చేసిన రైతులకు ఇప్పుడు లాటరీ తగిలినట్లు అయ్యింది.

**నేడు తోటల వద్దే కొనుగోలు**

తోటల వద్దకే వ్యాపారులు వచ్చి క్యాబేజీ పంటను కొనుగోలు చేసి, అక్కడే గ్రేడింగ్ చేసి బయటి రాష్ట్రాలకు లారీల్లో తీసుకెళుతున్నారు. ముఖ్యంగా చత్తీస్‌ఘడ్, రాయపూర్, భువనేశ్వర్, కటక్ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు సరుకును తీసుకెళుతున్నారు. స్థానిక మార్కెట్లలోనూ క్యాబేజీకి మంచి డిమాండ్ నెలకొంది.

**ధైర్యం చేసి పంట సాగుచేశా**



మా ప్రాంతంలో క్యాబేజీ సాగు చేసి ధరల్లేక తోటల్లోనే వదిలేసిన వాటిని చూశా. కానీ చూద్దాం జూలైలో ధరలు వస్తాయనే ధైర్యంతో పంటను సాగు చేశా. ఒకటిన్నర ఎకరాలో పంటను ఒబ్బిడి చేశా. 30 టన్నుల దాకా ఉత్పత్తి వచ్చింది. ధరలు బాగుడడంతో సంతోషంగా ఉంది.

– జగదీష్, రైతు, రామాపురం, పలమనేరు మండలం

**మంచి గిట్టుబాటు ధర**



నేను క్యాబేజీ పంటను నాలుగేళ్లుగా సాగు చేస్తున్నా. గతంలో ఎప్పుడూ కిలో రూపాయికి పడిపోలేదు. కానీ ఈ దఫా సరుకు కొనేవారు లేకుండా పోయారు. దీంతో చాలామంది రైతులు క్యాబేజీని సాగు చేయలేదు. ఇప్పుడు టన్ను రూ.12 వేలు దాటింది. తోటలున్న రైతులకు మంచి గిట్టుబాటుగా మారింది.

– హరి, రైతు, రామాపురం, పలమనేరు మండలం

### 250 మొబైల్ ఫోన్ల అప్పగింత

చిత్తూరు అర్బన్: ఫోన్లు చోరీకి గురవడం.. మరికొన్నిసార్లు పోగొట్టుకోవడం లాంటి ఘటనలు జరుగుతుంటాయి. ఇలాంటి కేసులను ఛేదించిన చిత్తూరు పోలీసులు దాదాపు రూ.50 లక్షల విలువ చేసే 250 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించారు. శనివారం చిత్తూరులోని పోలీసు అతిథి గృహంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎస్పీ మణికంఠ ఈ వివరాలను వెల్లడించారు. ఫోన్లను పోగొట్టుకున్న వారు, చోరీకి గురైనట్లు గుర్తించిన బాధితులు వాటి వివరాలను పోలీసుశాఖకు వాట్సాప్‌లో ఫోన్-9440900004 అనే నంబరుకు హాయ్ అని పెట్టడం, సీఈఐఆర్ అనే వెబ్‌సైట్‌లో వివరాలు నమోదు చేసుకోవడం ద్వారా ఫోన్లను కనిపెట్టి.. అప్పగించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో వచ్చిన ఫిర్యాదులపై దర్యాప్తు చేసి బాధితుల వద్ద ఉన్న వివరాల ఆధారంగా ఫోన్లను దేశంలోని ఏపీ, తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర తదితర పలు రాష్ట్రాల నుంచి తెప్పించామన్నారు. ఇందుకోసం పోలీసుశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఐటీ విభాగం పని చేస్తోందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు పన్నెండు దఫాల్లో 3,791 సెల్‌ఫోన్లను బాధితులకు అప్పగించామన్నారు. వీటి విలువ దాదాపు రూ.7.92 కోట్లు ఉంటుందన్నారు. సెల్‌ఫోన్లను రికవరీ చేసిన సీసీఎస్ సీఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది బాపూజీ, రఘురామ్, శ్రీనివాస్ ఇతర సిబ్బందికి సర్టిఫికెట్లను అందజేసిన ఎస్పీ, వారిని అభినందించారు. ఈ సమావేశంలో వన్‌టౌన్ సీఐ మహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుంచి ఇంజినీరింగ్ వెబ్ ఆప్షన్లు

తిరుపతి సిటీ : ఏపీఈఏ ఎంసెట్-2025 కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రధాన ఘట్టం వెబ్ ఆప్షన్ల ఎంపిక ప్రక్రియ ఆదివారం నుంచి కొనసాగనుంది. ఇప్పటికే రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకున్న అభ్యర్థులు బుధవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు తమకు నచ్చిన కళాశాలలో ఇంజినీరింగ్ కోర్సులను ఆన్‌లైన్‌లో ఎంపిక చేసుకోవాల్సి ఉంటుంది. 19వ తేదీన వెబ్‌ఆప్షన్ల మార్పునకు అవకాశం కల్పించిన ఉన్నత విద్యామండలి, 22వ తేదీన సీట్లు కేటాయించనుంది. సీట్లు సాధించిన విద్యార్థులు ఈనెల 23 నుంచి 26వ తేదీలోపు తమకు కేటాయించిన కళాశాలలో రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.

## స్వచ్ఛనీటి సరఫరా ప్రభుత్వాల బాధ్యత


భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న దళితసంఘాల నేతలు

నగరి : ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత అని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మనవడు, ఆల్ ఇండియా బుద్దిస్టు సొసైటీ జాతీయ అధ్యక్షుడు భీమ్‌రావ్ యశ్వంత్ అంబేడ్కర్ అన్నారు. తమిళనాడు తిరుత్తణిలో నిర్వహించిన జైభీమ్ మహానాడులో పాల్గొనడానికి వెళుతూ నగరి పట్టణంలోని దళిత సంఘాల ఆహ్వానం మేరకు శనివారం మధ్యాహ్నం బస్టాండ్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశానికి హాజరయ్యారు. స్థానిక నేతలు ఆయన్ని ఘనంగా స్వాగతించారు. ఆయన అంబేడ్కర్ విగ్రహానికి పూలదండ వేసి నివాళులర్పించారు. అనంతరం సమావేశంలో ఆయన మాట్లాడుతూ తరచూ ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడకు విచ్చేస్తుంటానని తన ఆర్గనైజేషన్ బుద్దిస్టు సొసైటీ అక్కడ ఉందన్నారు. ఇటీవల రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా, సమతా షైనింగ్ వెల్ అండ్ గుడ్‌డే సొసైటీ ఆఫ్ ఇండియా ఆర్గనైజేషన్లు కూడా ప్రారంభించామన్నారు. ఈ మూడు ఆర్గనైజేషన్లు డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ పునాది వేసిందన్నారు. దేశ వ్యాప్తంగా ఈ మూడు ఆర్గనైజేషన్లను స్థాపించడమే తన ధ్యేయమన్నారు. ఈ ఆర్గనైజేషన్లు వెనుకబడిన సామాజిక వర్గాల సమస్యల పరిష్కారానికి తోడ్పడుతుందన్నారు. ఎన్నో పార్టీలు వస్తున్నాయి అంబేడ్కర్ పేరును వాడుకుంటున్నాయని, ఆ పార్టీలకు మనం ఓటేస్తున్నామని, అయితే ఆ పార్టీలు మన సామాజిక వర్గానికి ఎలాంటి సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో డీపీఎఫ్ జాతీయ అధ్యక్షులు తిరునావుక్కరసు, రాష్ట్ర అధ్యక్షులు గజేంద్ర, ఆర్‌పీఐ పార్థసారధి, బీఎస్పీ నేత ధనంజేయులు, ఉమాపతి, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు బీడీ భాస్కర్, లాయర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# ఫలరాజసం


ర్యాంపులో నిల్వ చేసిన తోతాపురి మామిడి

నిన్నటి వరకు మామిడి కొనేవారు లేక.. అమ్ముడుపోక.. కాయలు కోయలేక.. ర్యాంపుల వద్ద పడిగాపులు కాయలేక.. సాగు కోసం చేసిన అప్పులు తీర్చే దారిలేక.. మామిడి రైతులు నెలరోజులుగా మగ్గిపోయారు. ఆ పరిస్థితిని దాటి నేడు మామిడి ధరలకు రెక్కలు వచ్చాయి. కిలో రూ.2 ఉన్న ధర కాస్త ఒక్కసారిగా రూ.7కు చేరింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారుపాళెం పర్యటకు రావడం.. ఆయనకు కూటమి సర్కారు అడ్డంకులు సృష్టించిన విషయం జాతీయ మీడియాలో ప్రసారం కావడంతో ఆ విషయం తెలుసుకున్న ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు ర్యాంపుల వద్దకు క్యూ కట్టడంతో మామిడి ఫలానికి రాజసం వచ్చింది.

**తోతాపురికి రెక్కలు**

- ర్యాంపుల వద్దకు ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు
- రూ.7 వేలకు చేరిన టన్ను ధర
- ర్యాంపుల వద్ద జోరందుకున్న వ్యాపారాలు
- సీజన్ చివరిలో మరింతగా పెరగనున్న ధరలు

పలమనేరు: నిన్నటిదాకా కిలో రూ.2 పలకని తోతాపురి మామిడి ధర శనివారం కిలో రూ.7 పలికింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి వ్యాపారులు ర్యాంపుల వద్ద కొనుగోలు చేస్తున్నందున ధర పెరిగిందనే మాట వినిపిస్తోంది. అయితే సీజన్ చివరిలో ధరలు పెరగడం మామూలేనని వ్యాపారులంటున్నారు. కూటమి ప్రభుత్వ విధానాలతో ఈ దఫా జిల్లాలోని మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయి అప్పులపాలయ్యారు. మామిడి గుజ్జు పరిశ్రమల్లో మామిడిని కొనకుండా రైతులు పడిన కష్టాలు తెలిసిందే. ఈ నేపథ్యంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మామిడి రైతులకు అండగా ధర పెంచాలని డిమాండ్ చేస్తూ ఇటీవల బంగారుపాళెం మార్కెట్‌కు వచ్చిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఈ అంశం జాతీయ మీడియాలోనూ హైలైట్ అయ్యింది. ఇక్కడ సరుకు చౌకగా దొరుకుందని తెలుసుకున్న పలు ఉత్తరాది రాష్ట్రాల వ్యాపారులు ఇక్కడికి రావడంతో డిమాండ్ నెలకొని, ధర పెరిగేందుకు కారణమైందనే మాట రైతుల్లో వినిపిస్తోంది.

**సీజన్ చివరిలో ధర వచ్చినా ఏం లాభం**

జిల్లాలో 60 వేల హెక్టార్లలో మామిడి తోటలుండగా ఇందులో తోతాపురి తోటలే 36 వేల హెక్టార్లుగా ఉన్నాయి. ఈ కాయలు గుజ్జుకు పోవాల్సిందే. ఆ మేరకు ఈ దఫా 4.60 లక్షల మెట్రిక్ టన్నుల తోతాపురి దిగుబడి వచ్చింది. ఇందులో కేవలం రెండు లక్షల మెట్రిట్ టన్నుల కాయలు మాత్రం జిల్లాలోని గుజ్జు పరిశ్రమలకు వెళ్లగా లక్ష మెట్రిక్ టన్నులు బయటి రాష్ట్రాలకు చేరింది. ఇప్పుడున్న సరుకు 1.60 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే. కాగా సీజన్ మరో మూడు వారాల్లో ముగియనుంది. దీంతో సీజన్ చివరిలో ధరలు పలికినా కొందరు రైతులకు మాత్రమే మేలు కలుగుతుంది.

**ర్యాంపుల వైపునకే మామిడి రైతుల చూపు**

దూరంగా ఉన్న పల్ప్ ఫ్యాక్టరీలకు మామిడి తీసుకెళ్లేకంటే ఆయా ప్రాంతాల్లోని ర్యాంపుల్లో అమ్ముకోవడం మేలని రైతులు భావిస్తున్నారు. ఎందుకంటే రవాణా చార్జీలు రైతుకు మిగులుతాయి. దీంతోపాటు ర్యాంపులకు తీసుకెళ్లిన సరుకు వెంటనే అమ్ముడవుతోంది. జిల్లాలో మొత్తం 40 దాకా ర్యాంపులున్నాయి. దీంతో ర్యాంపుల వద్ద మళ్లీ రైతులు, వ్యాపారుల సందడి మొదలైంది.


పొరుగు రాష్ట్రాలకు తరలించడానికి లారీలో లోడ్ చేస్తున్న తోతాపురి